ఆంధ్రజ్యోతి



అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 23 అక్టోబరు 2025

అడ్డరోడ్డు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోం మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో అడ్డరోడ్డు కూడలి జనసంద్రంగా మారింది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రులు, స్థానిక నేతలు ప్రసంగించారు.





ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న హోం మంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర. కార్యక్రమానికి హాజరైన టీడీపీ శ్రేణులు. (-వార్త 8వ పేజీలో)

అప్రమత్తం

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు

- వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికార యంత్రాంగం సన్నద్ధం
- మండలాల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్
- కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారి, జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న రెండు రోజుల్లో అధిక వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాలతోపాటు అన్ని మండలాల తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో వుంచే ఫోన్ నంబర్లను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఓలు, సీహెచ్‌డబ్ల్యూఓలు తాము పనిచేస్తున్న ప్రదేశాల్లో అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన 125 లోతట్టు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. శిథిలావస్థ భవనాలు, మిద్దె ఇళ్లల్లో వుంటున్న వారిని సురక్షిత భవనాల్లోకి తరలించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది తమ పరిధిలోని అన్ని చెరువులు, రిజర్వాయర్ల గట్లను తనిఖీ చేయాలన్నారు. జలాశయాల స్పిల్‌వే గేట్లన్నీ పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలని సూచిచారు. గాలులు, భారీ వర్షాల కారణంగా రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోతే వెంటనే తొలగించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, డీఆర్ఓ సత్యనారాయణరావు, డీసీఎస్ఓ మూర్తి, డీపీఓ సందీప్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపడీనం ప్రభావంతో రానున్న రెండు రోజులు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం వుండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ 24 గంటలూ సిబ్బంది అందుబాటులో వుంటారు. విపత్కర పరిస్థితులు ఏర్పడితే 08924-288888, 08924-225999, 08924-226599 నంబర్లకు ఫోన్ చేసి తెలియపరిస్తే వెంటనే సహాయక చర్యలు చేపడతారు.

పలుచోట్ల తేలికపాటి జల్లులు

అనకాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పడీనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం తేలికపాటి జల్లులు పడ్డాయి. అనకాపల్లి, చీడికాడ, ఎలమంచిలి, బుచ్చెయ్యపేట, రావికమతం, కోటవురట్ల, కె.కోటపాడు, మాడుగుల, మునగపాక మండలాల్లో కొంచెం ఎక్కువ వర్షం కురిసింది. నర్సీపట్నం, కశింకోట, పరవాడ, అచ్యుతాపురం, మాకవరపాలెం, గొలుగొండ, సబ్బవరం మండలాల్లో ఆకాశం మేఘావృతమై వుంది.

అనకాపల్లిలో వర్షం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం రాత్రి మోస్తర్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ రాత్రి ఏడు గంటల సమయంలో వర్షం మొదలైంది. వివిధ పనులపై ఇళ్ల నుంచి బయటకు వచ్చినవారు, ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచింది.



అనకాపల్లిలో వర్షం

ఇసుక కొరత రానివ్వొద్దు

ప్రతి నియోజకవర్గంలో స్టాక్ పాయింట్

- ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే మద్యం విక్రయాలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



సమీక్షా సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యేలు బండారు, పంచకర్ల, సమావేశానికి హాజరైన అధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు

అనకాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకునే వారికి ఇసుక కొరత లేకుండా ఉండేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి హోదాలో బుధవారం కలెక్టరేట్‌లో హోం శాఖ మంత్రి అనిత, అధికారులతో కలిసి గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడాలని, అవసరమైతే మరికొన్ని స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే విక్రయాలు జరగాలని సూచించారు. మద్యం బెల్ట్ షాపులు ఎక్కడా వుండకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు మాట్లాడుతూ, రాత్రిపూట జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, డీఆర్ఓ సత్యనారాయణరావు, అనకాపల్లి ఆర్డీఓ ఆయిషా, నర్సీపట్నం ఆర్డీఓ వీవీ రమణ, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిటికెలో విద్యుత్ కనెక్షన్

ఈపీడీసీఎల్ కొత్త విధానం

- దరఖాస్తుతోనే స్థిర చార్జీల వసూళ్లు
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా శ్రీకారం



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీకి ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు కొత్త కనెక్షన్ కావాలంటే దరఖాస్తు సమర్పించిన తరువాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీస్ లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ మొత్తం ఆధారపడి ఉండేది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్'ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విద్యుత్ వినియోగదారుల చట్టం 2020కి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ ... మిగతా 8వ పేజీలో

పట్టాలెక్కని పర్యాటకం

ప్రతిపాదనల్లోనే తారకరామ జలాశయ ప్రాంత అభివృద్ధి

- ఏడాది క్రితం కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, పలువురు అధికారులు పరిశీలన
- కలెక్టర్ ఆదేశాలతో డీపీఆర్ తయారు చేసిన పర్యాటక శాఖ
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఏడాది దాటినా కదలికలేని వైనం



మాడుగుల మండలంలో తారకరామ జలాశయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మాడుగుల మండలంలో తారకరామ జలాశయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనకు ఏడాది కావస్తున్నా కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది ఇదే నెలలో కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించి, సుమారు 120 ఎకరాల్లో పర్యాటక ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు డీపీఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఇంతవరకు అతీగతీ లేదు.

మాడుగుల మండలం తాటిపర్తి రెవెన్యూ పరిధి గరికబంధ సమీపంలో తాచేరు నదిపై జలాశయం నిర్మాణానికి 1988వ సంవత్సరంలో శ్రీకారం చుట్టారు. అప్పట్లో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.8.35 కోట్లు. ఆయుకట్టు విస్తీర్ణం 3,444 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు మొదలు కావడంతో తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు సరిగా చెల్లించకోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు పునరుద్ధరించి 2004 నాటికి 70 శాతం మేర పూర్తిచేశారు. జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం పెరిగిపోయి, తొలుత మంజూరైన నిధులతో ఇంతవరకే పనులు జరిగాయి. అదనపు నిధులు మంజూరు చేయకపోవడం, మరోవైపు కొంతమంది రైతులు కోర్టులో కేసు వేయడంతో పనులు జరగలేదు. తరువాత కోర్టు కేసులను ఉపసంహరించుకున్నప్పటికీ తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఇప్పటికే అసంపూర్తిగానే వుండిపోయింది. కాగా తారకరామ ... మిగతా 8వ పేజీలో



గత ఏడాది అక్టోబరులో తారకరామ జలాశయం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఎమ్మెల్యే బండారు, ఇతర అధికారులు (ఫైల్ ఫొటో)

ఫైర్ స్టేషన్ స్థాయి పెరిగేనా?

నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం పరిధిలో తొమ్మిది మండలాలు

- రెండు జిల్లాలకు సేవలు అందించడానికి ఉన్నది ఒక్కటే శకటం
- రెండో శకటం లేకపోవడంతో ఆస్తి నష్టాన్ని నివారించలేని పరిస్థితి
- డబుల్ యూనిట్‌కు అధికారుల ప్రతిపాదనలు
- ఇంతవరకు కార్యరూపం దాల్చని వైనం



నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో తొమ్మిది మండలాలకు అత్యవసర సేవలు అందిస్తున్న నర్సీపట్నం అగ్నిమాక కేంద్రం డబుల్ యూనిట్ ప్రతిపాదనకు మోక్షం లభించేనా? అని సందగ్ధంలో అధికారులు వున్నారు. సింగిల్ యూనిట్‌గా ఉన్న ఈ అగ్నిమాపక కేంద్రాన్ని డబుల్ యూనిట్ చేయాలంటూ అధికారులు చాలా కాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్‌వీ రమణ, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి మరోసారి ప్రతిపాదనలు పెట్టారు. డబుల్ యూనిట్ ఆవశ్యకతను ఆయనకు వివరించారు.

నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం పరిధిలో అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల, రోలుగుంట మండలాలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాలు ఉన్నాయి. అగ్నిమాపక అధికారి, ఒక పర్మినెంట్ డ్రైవర్, ఇద్దరు హోంగార్డు డ్రైవర్లు, ముగ్గురు ... మిగతా 8వ పేజీలో

బీఎన్ రోడ్డులో కూరుకుపోయిన లారీ

వాహనాల రాకపోకలకు ఆటంకం

- బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికుల అవస్థలు



బంగారుమెట్ట వద్ద గొయ్యిలో కూరుకుపోయిన టిప్పర్ లారీ

బుచ్చెయ్యపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భీమిలి- నర్సీపట్నం రోడ్డులో మండల పరిధిలోని బంగారుమెట్ట వద్ద భారీ వాహనంలో గొయ్యిలో కూరుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడ్డారు. మంగళవారం రాత్రి రావికమతం మండలంలోని ఒక క్వారీ నుంచి బండరాళ్ల లోడుతో టిప్పర్ లారీ రాంబిల్లి మండలంలో ఎన్ఏఓబీకి బయలుదేరింది. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో బంగారుమెట్ట జంక్షన్ సమీపంలోకి చేరుకుంది. ఇక్కడ రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యిలో కూరుకుపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బయటకు రాలేదు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కూరుకుపోయిన టిప్పర్ లారీ పక్కన ఖాళీ స్థలం వున్నప్పటికీ, అది బురదమయం కావడంతో చిన్నపాటి వాహనదారులు నెమ్మదిగా ముందుకు వెళ్లాల్సి వచ్చింది. ఆర్టీసి బస్సులు అటు లోపూడి నుంచి వెనక్కు, ఇటు బంగారుమెట్ట నుంచి వెనక్కు మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రెండు ఎక్స్‌కవేటర్లను రప్పించి, కూరుకుపోయిన టిప్పర్ లారీని ఎట్టకేలకు మధ్యాహ్నం రెండు గంటలకు బయటకు తీశారు.

పనిచేయని ఎస్కలేటర్

రైలు ప్రయాణికుల అవస్థలు

- రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు లగేజీతో వెళ్లడానికి ఇబ్బందులు



టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద పనిచేయని ఎస్కలేటర్



లగేజీ మోసుకుంటూ మెట్ల మార్గంలో ప్లాట్‌ఫారాలకు వెళుతున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి రైల్వేస్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు ప్రయాణికులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ మూలకు చేరింది. గత కొద్ది రోజులుగా ఎస్కలేటర్ పనిచేయకపోవడంతో ఈ రెండు ప్లాట్‌ఫారాలకు వచ్చే రైళ్లలో ఎక్కాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు ఎస్కలేటర్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం కావడంతో అనకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ఇక్కడి రాష్ట్రంలో, దేశంలో వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు కచ్చితంగా లగేజీతో వెళతారు. ప్రధాన ప్రవేశ మార్గం నుంచి రెండు, మూడు ప్లాట్ ఫారాలకు ప్రయాణికులు లగేజీతో శ్రమ లేకుండా వెళ్లడానికి, మెట్లు ఎక్కడానికి ఇబ్బంది పడే ... మిగతా 8వ పేజీలో

శివాలయాల్లో కార్తీక పూజలు ప్రారంభం



మునగపాక మండలం వెంకటాపురం నీలకంఠేశ్వర ఆలయంలో పూజలు

ఎలమంచిలి/అచ్యుతాపురం/మునగపాక/రాంబిల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి మండలాల్లోని శివాలయాలకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. తొలుత స్వామివారిని దర్శించుకున్న అనంతరం విశేష అర్చనలు, అభిషేకాలు చేయించారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. మునగపాకలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన స్వయంభూ శివలింగాన్ని పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ఇక్కడ నెలరోజులు అన్నసమారాధన జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ సీపీఎం ఆందోళన



నినాదాలు చేస్తున్న మత్స్యకార నాయకులు

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును రద్దుచేసి, రాజయ్యపేట మత్స్యకారులపై నిర్బంధాన్ని ఆపాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. పూడిమడకలో బుధవారం చేపట్టిన ఆందోళనలో మాట్లాడారు. రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పైగా న్యాయ పోరాటం చేస్తున్నవారిపై నిర్బంధం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పంథాను మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు చేపల తాతలు, కృష్ణ, అమ్మోరు, సోమునాయుడు, గంటారావు, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి'

మునగపాక, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఈవోపీఆర్డీ సోమరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, కార్యదర్శిలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అలాగే, సమస్యల పరిష్కారంలో ఏకాభిప్రాయానికి వస్తే ఆయా గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని సూచించారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించారు. ఎక్స్ఛేంజ్ 666 అనే ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న రాంబిల్లి మండలానికి చెందిన గనగళ్ల బంగార్రాజు, అచ్యుతాపురం మండలానికి చెందిన కొరుప్రోలు పూర్ణ కిశోర్, పరవాడ మండలానికి చెందిన మేడిశెట్టి రాజు, విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలానికి చెందిన గడిదేశీ ఈశ్వరరావులను అరెస్టు చేశారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

▸▸ అధికారులకు ఎమ్మెల్యే 'సుందరపు' ఆదేశం ▸▸ జడ్పీ అతిథి గృహంలో నిర్వహించిన జనవాణికి నియోజకవర్గం నుంచి 150కి పైగా వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపవద్దని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఇక్కడి జడ్పీ అతిథి గృహంలో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. పలువురితో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వారికి వివరించారు. నాలుగు మండలాల నుంచి సుమారు 150 మందికి పైగా వినతులు సమర్పించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో నిర్లక్ష్యం చూపవద్దంటూ పునరుద్ఘాటించారు. ఇందుకు సంబంధించిన ప్రగతిని ఎప్పటికప్పు తనకు వివరించాలని సూచించారు. మునిసిపల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు బొద్దపు శ్రీను, పూటకూటి రమేష్, కొఠారు శ్రీను, మోటూరు గోపి, వి.చిట్టిబాబులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం తొలుత ఇక్కడి ఆలయంలో వరిదుబ్బుకు పూజలు జరిపి నిలిపారు. అనంతరం ఆదిదంపతుల విగ్రహాన్ని ట్రాక్టర్‌పై పురవీధులగుండా మేళతాళాలతో ఊరేగిస్తూ నిలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పొలిమేర కృష్ణ, ఆడారి సూర్యచంద్రరామారావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప అంబలం పూజ



తులసీ కళా వేదిక వద్ద అయ్యప్ప అంబలం పూజ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నందీశ్వర ప్రాంగణం తులసీ కళా వేదిక వద్ద బుధవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. తొలుత అరటి దవ్వలతో స్వామివారి మండపాన్ని, పద్దెనిమిది మెట్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాల అనంతరం అయ్యప్ప మాలధరించిన భక్తుల భజనలు ప్రారంభమయ్యాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో స్వాములు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది.

నేటి నుంచి వాడ్రాపల్లిలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

మునగపాక, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు జరగనున్నాయని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు తెలిపారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పెదరామాలయం ప్రధాన జంక్షన్ వద్ద నాగులచవితి సందర్భంగా ఏటా ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తొలుత గురువారం సాయంత్రం ఈ పోటీలను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. మొత్తం 24 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నామని వివరించారు.

రాంబిల్లి మండలంలో భారీ వర్షం



రాంబిల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

రాంబిల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. అనంతరం అర గంటపాటు కుండపోతగా వాన కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల రహదారులు చిత్తడిగా మారాయి. రాకపోకలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ వర్షం వరి, అపరాల పంటల సాగుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంచికామాక్షి అలంకరణలో భూలోకమాంబ అమ్మవారు



ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పంచరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు మూడో రోజు బుధవారం కంచికామాక్షి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రోడ్డు విస్తరణ నేపథ్యంలో నేడు విద్యుత్‌కు అంతరాయం

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్పిడి జరుగుతున్నందున గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ ఎస్.రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా అచ్యుతాపురం, వెదురువాడ, గొర్లెధర్మవరం, మెట్టధర్మవరం, లంక ధర్మవరం, మార్టూరు రోడ్డు, సాయిప్రియ లే అవుట్, జగనన్న కాలనీ, ఆర్ఆర్ కాలనీ, పైడిమాంబ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం జంక్షన్, దిబ్బపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్డు, ఎస్‌టీబీఎల్ కాలనీ, అచ్యుతాపురంలలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఇందుకు వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు



రోగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత సినిమాహాలు జంక్షన్ వద్ద అహల్యాబాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి ప్రారంభించారు. సుమారు రెండు వందల మంది వరకు రోగులకు అనిల్ నీరుకొండ వైద్య కళాశాల వైద్యులు పరీక్షలు జరిపారు. ట్రస్టు ఛైర్మన్ శాంతి స్వరూప్, సభ్యులు తుట్టా నాగశ్రీను, వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే తెగుళ్ల నివారణ



తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏవో

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.ఉమాప్రసాద్ సూచించారు. మండలంలోని కాగిత, గుల్లిపాడు, సీహెచ్‌బీ అగ్రహారం గ్రామాల్లో ఆకుముడత తెగులు సోకిన వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో ఆకుముడత తెగులు ఉన్నట్టు గుర్తించామన్నారు. దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టడంపై రైతులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సత్యనారాయణ, శ్రీనివాస్, సాయికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్ర నామ పారాయణం



స్వామివారికి సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం ఘనంగా నిర్వహించారు. మంగవరం రోడ్డులోని సీతారామాలయంలో వికాసతరంగిణి సభ్యురాలు ఆండాళ్ రిందాదేవి, ఉప్పలపాటి శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం సుమారు 180 మంది మహిళలు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, పంచాయుధ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాడబలిజ సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని వినతి

పాయకరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాడబలిజ సామాజిక వర్గం అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం నేత, టీడీపీ పాయకరావుపేట మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథం బుధవారం ఈ వివరాలు వెల్లడించారు. తీర ప్రాంత గ్రామాల్లో ఎటువంటి గుర్తింపులేని వాడబలిజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు చింతకాయల ముత్యాలు, కోడా వెంకటరమణ, గోసల తాతారావు, చింతకాయల అమ్మవారు, టి.బలరాం, నూరారం ముత్యాలరావు, జి.పెద్దముత్యాలు, చేపల మసేను, కృష్ణ ఉన్నారు.

టీడీపీలోకి జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో చేరిక



మంత్రులు రవీంద్ర, అనిత సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీ కాకర దేవి, కార్యకర్తలు

ఎస్.రాయవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఎస్.రాయవరం మండల జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదగా టీడీపీ కండువా కప్పి జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవిను పార్టీలోకి ఆహ్వానించారు. అంతేకాకుండా వాకపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత పిట్ల నాయుడుతో పాటు మరో ఇరవై మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సమానంగా అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వినోద్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, నాయకులు అల్లు నరసింహమూర్తి, సోమిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లపై చర్యలు



అక్రమ లేఅవుట్లలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డు

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా గ్రామ పంచాయతీ స్థలాలు ఆక్రమించినా, అనుమతి లేకుండా లేఅవుట్లు వేసినా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు హెచ్చరించారు. న్యాయంపూడి పంచాయతీ పరిధిలో గుర్తించిన అక్రమ లేఅవుట్ల స్థలంలో బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల క్రయ, విక్రయాలు చెల్లవని స్పష్టం చేశారు. వీటిలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోతారని సూచించారు. అక్రమ లేఅవుట్ల సర్వే నంబర్లను రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేసి, బ్లాక్‌లో పెట్టిస్తున్నామని వారు తెలిపారు.

సంపద కేంద్రాల తనిఖీలు

మండలంలోని సీహెచ్ఎల్‌పురం, ఉద్దండపురం గ్రామాల్లో ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త ఏరివేతపై ఆరా తీశారు. మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయించారు. ఉద్దండపురం గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన ఫిర్యాదులపై గ్రామంలో విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు తరలిన టీడీపీ శ్రేణులు





పాయకరావుపేట నుంచి బయలుదేరిన నాయకులు... కోటవురట్ల నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

పాయకరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డులో బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పాయకరావుపేట నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, మండల మాజీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో పట్టణ, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అలాగే టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూడా అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు అడ్డరోడ్డుకు తరలివెళ్లారు.

కోటవురట్లలో...

కోటవురట్ల, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్ వద్ద బుధవారం జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతం చేసేందుకు కోటవురట్ల మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో తరలివెళ్లారు. బహిరంగ సభకు టీడీపీ మండల ప్రతినిధులు పెట్లలింగం నాయుడు, జానకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోటవురట్ల, కైలాసపట్నం టీకేపల్లి, లింగాపురం తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తిరుమలరావు, గొట్టివాడ సుంకర్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

▸▸ పీఆర్‌టీయూ విశాఖ కన్వీనర్ గోపీనాథ్

కోటవురట్ల, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ముందుంటామని పీఆర్‌టీయూ విశాఖ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గోపీనాథ్ చెప్పారు. బుధవారం వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పండితుల పదోన్నతులు, డీఏ, మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్‌కేర్ సెలవులు తదితర సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. పీఆర్‌సీ కోసం కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామమూర్తి, విజయకుమార్, నాయకులు పీడేవిడ్, ఆర్.ప్రతాప్‌కుమార్, అబ్దుల్లా పాల్గొన్నారు.

సమస్యలపై పీఆర్‌టీయూ పోరాటం

పాయకరావుపేట: ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ అలుపెరుగని పోరాటం చేస్తుఈన్నదని సంఘం మండల అధ్యక్షుడు అడపా ప్రకాశ్ చెప్పారు. పాయకరావుపేట పట్టణ, గ్రామాల్లోని పలు పాఠశాలల్లో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యలు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, నాయకులు మహేశ్, వీరభద్రరావు, సత్యనారాయణ, సత్యశ్రీనివాస్, నూకరాజు, గోవింద్, తులసిబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

కోటవురట్ల, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు తెలిపారు. మండలంలో తొలిసారి హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఉదయం పది గంటలకు ఈ మేళా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ మేళాలో 18 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన నిరుద్యోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్‌మేళాకు యువతీ, యువకులు విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా గోపి

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్దండపురం గ్రామ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా దోని గోపీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు టి.నాగమణి, కూర్మారావు ఆధ్వర్యంలో బుధవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా దొంగల అప్పలరాజు, డైరెక్టర్లుగా మల్లె మసేను, కె.సత్తిబాబు, డి.నూకరాజు, ఆర్.అచ్చారావు, ఎ.శ్రీను ఎన్నికయ్యారు. గోపికి అధికారులు నియామకపత్రాన్ని అందజేశారు.



నియామకపత్రం అందిస్తున్న మత్స్య శాఖ అధికారులు

జీఎస్టీ సంస్కరణలపై 'మళ్ల' ఇంటింటా ప్రచారం



అరుంధతినగర్‌లో మహిళకు జీఎస్టీ కరపత్రాలను అందిస్తున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌'పై గవరపాలెం అరుంధతినగర్‌లో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ సంస్కరణ వలన కలిగే లాభాలను వివరించారు. వస్తువుల ధరలు తగ్గినందున కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు అవగాహనతో వ్యవహరించాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాడి వాసు, పెట్ల శ్రీను, అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయానికి రెండు వాషింగ్ మిషన్లు వితరణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయానికి సీఎస్ఆర్ నిధులతో ఓ సంస్థ రెండు వాషింగ్ మిషన్‌లను అందజేసినట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు బుధవారం తెలిపారు. వీటి వల్ల ఆపరేషన్ థియేటర్ డ్రెస్సెస్, బెడ్‌షీట్లు తదితరాలు తొందరగా శుభ్రం చేయడానికి ఆస్కారం ఉంటుందని వివరించారు. వీటి విలువ సుమారు ఐదు లక్షల రూపాయలకు పైగా ఉంటుందని, వీటిని అందుబాటులోకి తీసుకువచ్చిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డీడీ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎరువులు సరిపడా సరఫరా చేయాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని సీపీఎం నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంగళవారం ఎస్.రాయవరం మండలం సైతారుపేటలో రైతులు యూరియా కోసం బారులు తీరి చివరకు తోపులాటకు దిగారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

లో వోల్టేజీ సమస్యపై శ్రీరామ్‌నగర్ కాలనీ వాసుల వినతి



విద్యుత్ శాఖాధికారిణి లక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

లంకెలపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో విద్యుత్ సమస్యపై స్థానికులు రౌతు మూర్తి, విరోతి మణికంఠ తదితరులతో పాటు పలువురు మహిళలు బుధవారం ఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సబ్ ఇంజనీర్ లక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొద్ది రోజులుగా లో వోల్టేజీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఇళ్లలో లైట్లు వెలగడం లేదన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

28 నుంచి అనకాపల్లిలో పుస్తక మహోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో ఈ నెల 28 నుంచి నవంబరు ఐదో తేదీ వరకు నిర్వహించనున్న విజయవాడ పుస్తక మహోత్సవ్ (బుక్ ఫెస్టివల్) పోస్టర్‌ను బుధవారం విశాఖపట్నంలోని కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అధ్వానంగా ఊడేరు ప్రధాన రహదారి

▸▸ ఎక్కడికక్కడ గోతులమయం ▸▸ వర్షాలకు నీరు చేరుతుండడంతో అవస్థలు



ఊడేరు గ్రామంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

తుమ్మపాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊడేరు గ్రామంలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు పడడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆయా గోతుల్లో నీరు చేరి నిలిచిపోతుండడం మరిన్ని సమస్యలకు కారణమవుతోంది. ప్రధాన రహదారి చెరువును తలపించేలా ఉంటుండడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారికి ఇరుపక్కలా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు ప్రవహించే మార్గం లేక రోజుల తరబడి వర్షపునీరు, వాడుకనీరు తిష్ఠ వేస్తోందని అంటున్నారు. ఈ కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు ఊడేరు ప్రధాన రహదారిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



ఊడేరు మధ్యలో చెరువును తలపించేలా...

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

▸▸ వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ▸▸ భక్తులతో కోలాహలంగా మారిన ఆలయాలు



శారదానది ఒడ్డున గల ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం



భోగలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న రాంకీ, భక్తులు



సబ్బవరం మండలం పెదయాతపాలెంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు



హేమగిరిపై సత్యనారాయణస్వామి ఆలయంలో...

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన కార్తీకమాసం ఆరంభం కావడంతో శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. ఊరూరా గల ఆలయాల్లో బుధవారం వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి పట్టణంలో శారదానది ఒడ్డున గల ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర ఆల యం, మెయిన్ రోడ్డులోని సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం, గవరపాలెంలోని భోగలింగేశ్వరుని ఆలయం, కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయా లకు భక్తులు పోటెత్తారు. శారదానది ఒడ్డున గల ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రత్యేకతలను సంతరించుకుని ఉంటుంది. ఒకపక్క గలగల పారే శారదా నది, మరో పక్క వీచే స్వచ్ఛమైన గాలితో ఈ ప్రాం తం ఆహ్లాదకరంగా దర్శనమిస్తుంది. దీంతో రోజూ ఇక్కడ విశేష పూజలు నిర్వహిస్తుంటారు. కార్తీక మాసంలోని నాలుగు సోమవారాలు ఆలయంలో ఉదయం నాలుగు గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు జరపనున్నామని నిర్వాహకులు కర్రి జగ్గఅప్పారావు, భీమరశెట్టి రామకృష్ణ, కొణతాల కృష్ణలు తెలిపారు. నవంబరు 21న పోలిపాడ్యమి సందర్భంగా భారీ ఎత్తున అన్నసమారాధన జరపనున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే, బుధవారం గవరపాలెంలోని భోగలింగేశ్వరస్వామి, కోటవీధిలోని కుసుమ హరనాథబాబా, సిద్ధిలింగేశ్వర, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

సత్యనారాయణపురంలోని హేమగిరిపై...

కొత్తూరు : సత్యనారాయణపురంలోని హేమగిరిపై కొలువుదీరిన సత్యనారాయణస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అప్పికొండ గణేశ్ ఆయనను సత్కరించారు. కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి నూకరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెదయాతపాలెంలో...

సబ్బవరం : మండలంలోని ప్రముఖ ఆలయాల్లో ఆరిపాక శివారు పెద యాతపాలెంలో గల గౌరీపరమేశ్వర్ల ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం ఒకటి. కార్తీక మాసం ప్రాంభం కావడంతో ఇక్కడ భక్తుల సందడి ఆరంభమైంది. చుట్టూ కొబ్బరి తోట, మధ్యలో పచ్చదనం పరుచుకున్నట్టు అందమైన మొక్కలు ఇక్కడ ప్రత్యేకతలు. ప్రతి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. కార్తీమాసంలో వచ్చే సోమవారాల్లో ఈ తాకిడి మరింత అధికంగా ఉంటుంది. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపడుతుంటామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం రీసర్వే పూర్తి చేయాలి : జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వేను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జేసీ ఎం.జాహ్నవి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహించారు. పీజీఆర్ఎస్, రీసర్వే, ఎంఎల్‌సీసీ, ఐవీఆర్ఎస్, నీటి తీరువా, కోర్టు కేసులు, పౌరసరఫరాలు, దీపం-2 పథకం రీ పేమెంటు, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు రెండు విడతలు రీసర్వే చేశామని, మూడవ విడత అనకాపల్లి డివిజన్‌లో 15 గ్రామాలు, నర్సీపట్నం డివిజన్‌లో 15 గ్రామాల్లో ఈ నెల మూడో తేదీన రీసర్వే ప్రారంభమైందన్నారు. మొత్తం 80 బృందాలు పనిచేస్తున్నాయని, భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. రేషన్ షాపులు, బియ్యం బిల్లులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవోలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి, సర్వే ఏడీ గోపాలరాజు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పాము కాటుకు ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇంజక్షన్లు

▸▸ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు



రోగి కేస్ షీట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ నాయుడు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయని, ఈ తరుణంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు సూచించారు. వైద్యాలయంలోని మహిళా వార్డుకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలను బుధవారం పరిశీలించారు. ముఖ్యంగా పాము కాటు కేసులు ఎక్కువగా వస్తున్నాయని తెలుసుకున్న ఆయన పాము కాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ పాము ఎవరికైనా కాటేసినట్లయితే వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. పాము కాటు నివారణ ఇంజక్షన్లు వైద్యాలయంలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనంతరం వైద్య సేవలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పీఏసీఎస్‌లకు పాలకవర్గాల నియామకం




తుమ్మపాల, కశింకోట పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్లు కోట్ని బాలాజీ, సిదిరెడ్డి శ్రీనివాసరావు

తుమ్మపాల/కశింకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదలయ్యాయి. తుమ్మపాల పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కోట్ని బాలాజీ నియమితులయ్యారు. పర్సన్లుగా ఆర్.జగదీశ్, చదరం వెంకట సూర్యరాజులను నియమించారు. అలాగే శ్రీ గౌరీ పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కర్రి మహాలక్ష్మీనాయుడు, పర్సన్లుగా కాండ్రేగుల నూకేశ్వరరావు, యల్లపు శ్రీనివాసరావు, చింతనిప్పుల అగ్రహారం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బంటు నాగ రవిసంతోష్, పర్సన్లుగా జెర్రిపోతుల రమణ, గనిరెడ్డి తిరుపతిరావు, కశింకోట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సిదిరెడ్డి శ్రీనివాసరావు, పర్సన్లుగా ఎస్.అప్పారావు, గండిబోయిన కాశీరావు, నరసింగబిల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మజ్జి వెంకటనిరంజన్ కుమార్, పర్సన్లుగా సరిపల్లి నానిబాబు, మల్లపురెడ్డి గిరిబాబులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ సంస్థ అభ్యున్నతికి పాటు పడతామని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మానస ఎంపిక



మోస మానస

పరవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మోస మానస ఎంపికయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఎస్‌జీఎఫ్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మానస అత్యంత ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తల్లిదండ్రులు అప్పారావు, దేవి తెలిపారు. వచ్చే నెల గుంటూరు జిల్లా పల్నాడులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మానస పాల్గొంటుందని తెలిపారు. మునగపాక మండలం పాటిపల్లిలో గల ఏపీ మోడల్ కళాశాలలో మానస ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు నివాళి



పాఠశాల ఆవరణలో కలామ్ విగ్రహం వద్ద విద్యార్థినుల నివాళి

కశింకోట, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సువర్ణకుమారి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటకోట కిశోర్, వెంకటేష్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైల్ ట్రేడ్‌పై విద్యార్థులకు అవగాహన



ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా స్మార్ట్ బజారుకు వచ్చిన విద్యార్థులు

కశింకోట, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా రిటైల్ ట్రేడ్‌పై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీజే ప్రసాద్ విద్యార్థులను స్మార్ట్ బజారు వద్దకు తీసుకు వెళ్లి అక్కడ జరుగుతున్న క్యాష్ ట్రాన్షక్షన్, రికార్డు మెయింటినెన్స్, కస్టమర్ సర్వీస్, ప్రొడక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ టూర్ విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, ఆనంద్, మానస, ఒకేషనల్ ట్రైనర్ సిహెచ్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'లావాదేవీలు జరపని ఖాతాలకు రీ కేవైసీ'

కశింకోట, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్లుగా బ్యాంకు ఖాతాలు లావాదేవీలు జరపని వారు తక్షణమే రీకేవైసీ చేసుకొని తమ ఖాతాను పునరుద్ధరించుకోవాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహన పిలుపునిచ్చారు. బయ్యవరం, కశింకోట గ్రామాల్లో ఉన్న ఎస్‌బీఐ, ఐవోబీ బ్రాంచ్‌ల్లో ఖాతాదారులకు బుధవారం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బ్యాంకుల్లో ఉన్న ఖాతాల్లో ఎప్పటికప్పుడు లావాదేవీలు నిర్వహించుకుంటే ఆ ఖాతాలో ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. ఏళ్ల తరబడి ఖాతాలు తెరిచి వాడనివారు ఇప్పటికైనా రీ కేవైసీ చేయించుకొని నగదు లావాదేవీలు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఏళ్ల తరబడి ఖాతాలు వాడకుండా ఉంటే ఆయా నగదు ఆర్‌బీఐకి తిరిగి వెళ్లిపోతుందని వివరించారు. అనంతరం ఆయనను ఎస్‌బీఐ, ఐవోబీ బ్రాంచ్‌ల ప్రతినిధులు శాలువలతో కప్పి సత్కరించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మహాపాత్రో, ఐవోబీ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలోని సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరవాడ, తానాం, భరణికం, ఈ.బోనంగి, గొర్లివానిపాలెం, పి.బోనంగి, కలపాక, రావాడ, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, తిక్కవానిపాలెం, దళాయిపాలెం, వాడ చీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

'వార్డులో సమస్యలపై ప్రత్యేక దృష్టి'



కార్పొరేట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలాజీనగర్‌వాసులు

పరవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వార్డులో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. దేశపాత్రునిపాలెం, బాలాజీనగర్‌లలో బుధవారం పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాతో పాటు కొత్తగా వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు మచ్చ కుమార్, కరణం అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సహచరుల బాసట

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సహచరుని కుటుంబానికి శక్తి పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. 1990 పోలీసు బ్యాచ్‌కు చెందిన అసోసియేషన్ సభ్యుడు వి.అప్పలరాజు మృతిచెందడంతో ఆయన కుటుంబానికి బుధవారం అసోసియేషన్ తరఫున సభ్యులు పూర్ణ చంద్రరావు, మిలిట్రీనాయుడు, అప్పారావు తదితరులు లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

మత్స్యకారుడి కుటుంబానికి సర్పంచ్ సాయం



అప్పలరాజు కుటుంబానికి నగదు అందిస్తున్న సర్పంచు

పరవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముత్యాలమ్మపాలెం తీరంలో చేపల వేటకు వెళ్తూ అలలకు గల్లంతై మరణించిన మత్స్యకార యువకుడు అర్జిల్లి బంగార్రాజు కుటుంబానికి ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ఆసరాగా నిలిచారు. ఆయన కుటుంబానికి రూ. 25వేలు నగదును బుధవారం అందజేశారు. మత్స్యకారులు చిన ముత్యాలు, కంబాల సత్యం, అర్జిల్లి బంగారు, అప్పారావు, చింతకాయల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

'గొప్ప మానవతావాది శంకరన్'

తుమ్మపాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఐఏఎస్ అధికారి, దివంగత నేత ఎస్ఆర్ శంకరన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు శంకరన్ జయంతి సందర్భంగా బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. శంకరన్ ఉన్నతాధికాకి స్థానంలో ఉన్నప్పటికీ నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప మానవతావాదిగా పేర్కొన్నారు. పరమేశ్వరి, ఫణేంద్ర, కోరిబిల్లి శంకరరావు, విత్తనాల పోతురాజు, మత్సుర్తి సూరిబాబు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రింతాడ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి తెలిపారు. బుధవారం చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆమె పరామర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందడం, తొమ్మిది మంది గాయపడడం విచారకరమన్నారు. తీవ్రంగా గాయపడిన వంతల లక్ష్మికి కేజీహెచ్‌లో మెరుగైన చికిత్స అందించేలా ఎస్టీసెల్ అధికారులతో మాట్లాటామన్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలోనున్న చికిత్స పొందుతున్న బాధితులకు వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ రోడ్డు ప్రమాద ఘటనను కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆమె వివరించారు. వైద్యనిపుణులు డి. అనుష, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ హశ్వంత్, డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, కేశ్వరరావు, పార్టీ నాయకులతు అర్జున్, వల్లి పాల్గొన్నారు.

కొమరం భీమ్ పోరాటం స్ఫూర్తిదాయకం



కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గిరిజన సమాఖ్య నేతలు

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పోరాట యోధుడు కొమరం భీమ్ జయంతి వేడుకలను బుధవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య, ఏబీవీపీ నాయకుల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. గిరిజన సమాఖ్య కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఆధ్వర్యంలో భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరం భీం ఆదివాసీ హక్కుల సాధనకు నిజాం పాలనపై పోరాడారన్నారు. ఆయన చేపట్టిన జల్, జంగిల్ జమీన్, గెరిల్లా పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గోమంగి మండల సాధన సమితి నాయకులు కె.బొంజుబాబు, సల్లంగి ఉ మామహేశ్వరరావు, కె.సురేశ్‌కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు వంతాల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మణ్, సీపీఐ నేత చంటిబాబు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తిరుపల్లి యోగి ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. యోగి మాట్లాడుతూ దేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చారిత్రాత్మకమైనవి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజెలి కృష్ణమూర్తి, వెంకట్, జయకుమార్, సంజయ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలుపై పోటీ

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, చట్టాలపై విద్యార్థుల్లో అవగాహనకు పలు కార్యక్రమాలను చేపడుతున్నట్టు జిల్లా నోడల్ అధికారి బి.దిలీప్‌కుమార్ తెలిపారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చట్టాలపై వ్యాసరచన, వ్యాఖ్యానం, క్విజ్ తదితర పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, వీరిలో ప్రతిభను కనపరిచిన ఓ విద్యార్థిని నవంబరు 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న స్టూడెంట్ అసెంబ్లీకి పంపించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అందరికీ ప్రయోజనం



జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నేతలు

ముంచంగిపుట్టు, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ అన్నారు. మండలంలోని మాకవరం పంచాయతీ బీటి చంప గ్రామంలో బుధవారం కూటమి నేతలు జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో నిత్యావసర సరకులు, దుస్తులు, పాదరక్షలు, మందులు, స్టేషనరీ, వాహనాలు తదితర వాటి ధరలు తగ్గాయని తెలిపారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల లబ్ధిదారులకు మేలు జరుగుతుందని అన్నారు కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎస్.బాబూజీ, తెలుగు యువత అధ్యక్షులు ఎం.చిన్న, నేతలు కె.లొక్కిరామ్, కె.పద్మనాభం, ఎం.భీమన్న పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

ముంచంగిపుట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు ఉండాలని దారెల గ్రామ సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై వివరించారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా, సారా తయారు చేసినా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. చాలా మంది యువత మత్తుకు బానిసై జీవితాలను పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీంగూడ తలింబ గ్రామాల సమీపంలో రచ్చబండకు సర్పంచ్ పాండురంగస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు సాధురాం, ఉప సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము ఇన్‌చార్జిగా రవికుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న రవికుమార్

ముంచంగిపుట్టు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పౌర సరఫరా శాఖ గోదాంఇన్‌చార్జిగా వెంగడ రవికుమార్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పని చేస్తున్న రవికుమార్ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ కోటా శంకరరావు సమక్షంలో గోదాం ఇన్‌చార్జిగా బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, కూటమి నేతలు జి.రామ్మూర్తి, కె.బలరాం, లక్ష్మణరావు, సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సింహాచలం, జీసీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముంచంగిపుట్టు, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు బుధవారం పాఠశాలను సందర్శించారు. నీటి సమస్యపై ఆరా తీశారు. తాగునీటి పథకానికి రూ.40లక్షలు నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వారు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జేఈ రాజేశ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈఈ రాములు, మాజీ సర్పంచు వి.రామస్వామి, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల సాగుతో అధిక ఆదాయం

» విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి శిక్షణ, పరికరాలు పంపిణీ

» ఏపీఎంఏపీబీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కాథి ప్రదీప్‌కుమార్



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్ కుమార్

చింతపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఔషధ మొక్కల సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని అమరావతి ఏపీ మెడిసనల్ అరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు(ఏపీఎంఏపీబీ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కాథి ప్రదీప్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తాజంగి పంచాయతీ రేగుబయలు గ్రామంలో మన్యసీమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల సాగు, మార్కెటింగ్‌పై ఏపీ మెడిసనల్ అరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతం ఔషధ మొక్కల సాగుకి అత్యంత అనుకూలమన్నారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ఔషధ మొక్కలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఇక్కడి ఆదివాసీ రైతులు ఇప్పటికే పిప్పళ్లు, ఉసిరి సాగు చేస్తున్నారన్నారు. అలాగే, నిమ్మగడ్డి, సర్పగంధి, సతావరి, తిప్పతీగ, అడవినాబి తదితర ఔషధ మొక్కల సాగుకూ ముందుకు రావాలన్నారు. ఇందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తోందన్నారు. అలాగే ఔషధ మొక్కల నుంచి సేకరించిన ఉత్పత్తులకు విలువలు జోడించేందుకు అవసరమైన పరికాలను బోర్డు సమకూర్చుతుందని తెలిపారు. భవిష్యత్తులో పసుపు నుంచి నూనె సేకరించే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించి యంత్రాలను అందజేస్తామన్నారు. రైతులు ఔషధ, సుగంధ ద్రవ్య పంటల సాగుకు ఆసక్తి చూపితే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మన్యసీమ స్వచ్ఛంద సేవా సంస్థ సీఈవో శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రవాహానికి ఎదురీది.. ప్రాణాలకు తెగించి..

» ఒనుకొండ గ్రామ గిరిజనుల ప్రయాణం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఒనుకొండ గెడ్డను దాటుకుంటూ వెళ్తున్న గిరిజనుడు

అనంతగిరి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా గిరిపుత్రుల జీవితాలు మాత్రం ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్నట్టున్నాయి. వర్షాకాలంలో గెడ్డలను ఆనుకుని అవతలివైపుగా ఉన్న గ్రామాల గిరిజనులు నరకం చూస్తున్నారు. మండలంలోని లుంగుపర్తి పంచాయతీ ఒనుకొండ గ్రామానికి వెళ్లేందుకు గిరిజనుల అవస్థలు వర్ణనాతీతం. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఒనుకొండ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. గిరిజనులు నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని కొనుగోలుకు, బుధవారం డముకు వారపు సంతకు వచ్చి, తిరుగు ప్రయాణంలో గెడ్డ ఒక్కసారిగా ఉధృతి పెరిగింది. అయినా, తప్పనిసరిగా ప్రాణాలు తెగించి, ఈ నీటి ప్రవాహంలో ఈదుకుంటూ గిరిజనులు అవతలివైపుగా చేరుకున్నారు. ఒనుకొండ గ్రామానికి వంతెన నిర్మాణంతో పాటు మెట్టవలస నుంచి ఒనుకొండ వరకు రోడ్డు సౌకర్యానికి నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారణ భక్తులు

జి.మాడుగుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి నిర్వహించిన అంబలం పూజకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురుస్వాములు వి.శ్రీనివాసరావు, మత్స్యకొండంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏజెన్సీ ప్రాంతంలోని అయ్యప్ప మాలధారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకారంలో అయ్యప్ప గుడి అందరినీ ఆకట్టుకుంది.

డిగ్రీ కళాశాలకు ఆర్వోప్లాంట్ వితరణ

అరకులోయ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా డిగ్రీ కళాశాలకు జిల్లా కలెక్టర్ చొరవతో ఆర్వో ప్లాంట్ మంజూరైనట్టు ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు తెలిపారు. పాడేరుకు చెందిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి ఈ ఆర్వో ప్లాంట్‌కు రూ.3.5 లక్షలు కేటాయించారన్నారు. పాడేరు బ్యాంకు మేనేజర్ ఎల్.బాను చంద్రన్, డుంబ్రిగుడ బ్యాంకు శాఖ మేనేజర్ ఎం.అమర్‌నాథ్ బుధవారం కళాశాలకు విచ్చేసి ఈ మంజూరు పత్రాలు అందించినట్టు చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వోప్లాంట్‌కు నిధులు మంజూరు చేయడంపై అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో కళాశాలలో ఆర్వోప్లాంట్ అందుబాటులోకి రానుందన్నారు.

1న శ్రీనివాస కల్యాణం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, ప్రజాప్రతినిధులు

చింతపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంది పాకలు పంచాయతీ కేంద్రంలో నవంబరు ఒకటో తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. బుధవారం జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, ఏ ఎంసీ వైస్‌చైర్మన్ హశ్వంత్‌తో కలిసి ఎంపీపీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఆ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హరికథ, అన్నమయ్య కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారద, సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ కేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, మోహనరావు, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి బెన్నిబాబు పాల్గొన్నారు.

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హైవోల్టేజీ వల్ల విద్యుత్ గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా హైవోల్టేజీ వచ్చింది. రెండు గృహాల్లో విద్యుత్ వైర్లు, 15 టీవీలు, రెండు టైలరింగ్ మోటార్లు, రెండు మిక్సీలు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య కారణంగా హైవోల్టేజీ వచ్చినట్టు ఈపీడీసీఎల్ సిబ్బంది చెబుతున్నారు. సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఏఈఈ ప్రభాకరరావు తెలిపారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రంపై విచారణ

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర కోరారు. మండలంలోని వనుగుపల్లి పంచాయతీ తామరాపల్లికి చెందిన మజ్జి కృష్ణారావు కుటుంబ సభ్యులు నకిలీ కులధ్రువీకరణ పత్రాలను పొందినట్లు చేసిన ఫిర్యాదుపై బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించిన వీఆర్‌వో వెచ్చంగి రామజోగారావు, నూకరత్నంలను వారు కలిశారు. మైదాన ప్రాంతానికి చెందిన కృష్ణారావు ఎస్సీ సచ్చడి కులానికి చెందిన వారని, కానీ, 2019, 2021లో ఎస్టీ కొండదొర కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను పొందడం విడ్డూరంగా ఉందని రామారావు దొర అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు బుడిదే మాధవరావు, కె.కిశోర్, తామరాపల్లి గ్రామ పెద్దలు ప్రసాద్‌నాయుడు, ప్రకాష్, ఈశ్వరరావు, సోంబాబు, కొండబాబు పాల్గొన్నారు.

కార్తీక మాసం పూజలు ప్రారంభం



ఆకాశ దీపారాధనలో పాల్గొన్న భక్తులు

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో బుధవారం పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి, పాత పాడేరులోని గౌరీ నీలకంఠేశ్వరుని, త్రిముఖ లింగేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో అర్చకులు ఉప్పల రామం పంతులు ప్రత్యేక అర్చనలు, పూజలను చేపట్టారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రసాదం, తాగునీటి పంపిణీ చేపట్టారు. రాత్రి ఆకాశ దీపారాధన చేపట్టారు. అయ్యప్ప స్వామి ఆలయంలోని శివాలయంలో ఆకాశదీపారాధనను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, రాజబాబు, బాబూరావు, కొండలరావు, ముకుందరావు, వెంకటరత్నం, శ్రీనివాస్ కుమార్, ఆదిత్య పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి నాయక్

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 64 పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 297 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు (హెచ్‌డబ్ల్యూసీ)ల ద్వారా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్ ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో 12 రకాల వైద్య సేవలను బలోపేతానికి ప్రొఫెసర్ డాక్టర్.వైఎస్.కుసుమ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో ఉన్న హెచ్‌డబ్ల్యూసీలు ఈ శిక్షణలో తెలుసుకున్న విషయాలపై డిసెంబరు 2వ వారం వరకు టీమ్‌ల వారీగా స్క్రీనింగ్ పరీక్షలు, ప్రాథమిక వైద్యం తదితర మెరుగైన సేవలను ప్రజలకు అందించాలన్నారు. 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, 105 రకాల మందులను అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హెచ్‌డబ్ల్యూసీలు తెరిచిఉంచాలన్నారు. ప్రతీ రోజూ కనీసం 25 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి చికిత్సలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో టీఎస్.ప్రతాప్, జిల్లా కుష్ఠు, క్షయ నివారణాధికారి ఎం.కిరణ్‌కుమార్, ఐసీఎంఆర్ కన్సల్టెంట్ రాజేంద్రవర్మ, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమ్మె



అరకులోయంలో ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

అరకులోయ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు తమకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నుంచి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సహాయకార్యదర్శి భగత్‌రాం, ప్రభుత్వ ఆస్పత్రుల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రఘు మాట్లాడుతూ, సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం నెలకు రూ.18,600 వేతనం చెల్లించడంలేదని ఆరోపించారు. ఈ మేరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, కాంట్రాక్టర్‌కు, ఉన్నతాధికారులకు ముందుగానే సమ్మె నోటీసు అందించామన్నారు. కార్యక్రమంలో ద్రౌపతి, బాలన్న పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. బుధవారం ఆస్పత్రి కార్మికులు సమ్మెను ప్రారంభించి నిరసన తెలిపారు.కార్మిక సంఘం నాయకులు రామారావు, ఈశ్వరరావుగిరిబాబు, గిరి, రాములమ్మ, గున్నమ్మ, గంగమ్మ, సింహాచలం పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

పెదబయలు: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్లలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, సబ్‌స్టేషన్‌లో గత 15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న ఉద్యోగులను సంస్థలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేతనాలు పెంచాలన్నారు.

చింతపల్లి: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను ఈపీడీసీఎల్‌లో విలీనం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఉప కేంద్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు రాజబాబు, సత్యనారాయణ, శేఖర్, ప్రసాద్, హేమంత్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ



అనుష్కను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అరకులోయ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో చెందిన జువాలజీ విద్యార్థిని జి.అనుష్క చిత్రలేఖనంలో మొదటి స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి 8 వతేదీ వరకు విశాఖలోని ఇందిరాగాంధీ నేషనల్ జువాలజికల్ పార్కులో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో కళాశాల అధ్యాపకులు బలరాం, డీవీఎస్ ప్రణీత ప్రోత్సాహంతో జూవాలజీ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న జి.అనుష్క వైల్డ్‌లైఫ్ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా జరిగిన చిత్రలేఖనం పోటీలకు హాజరై ప్రథమ బహుమతిని సొంతం చేసుకుందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తోటి విద్యార్థినులు అభినందించారు.

వైద్యుల సమ్మెకు సిబ్బంది మద్దతు



రూఢకోట పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

పెదబయలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏజేన్సీ ప్రాంతంలోని వైద్యులు 13 రోజులుగా విజయవాడలో చేపట్టిన నిరవధిక సమ్మెకు రూఢకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మద్దతు తెలిపారు. బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న డాక్టర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామారావు, భాగ్య, నాగరాజు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మూగజీవాలకు వైద్యం



మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో తీవ్ర గాయాలు తగిలిన మూగజీవాలకు పశు వైద్య సిబ్బంది గంటల తరబడి శ్రమించి వైద్య సేవలందించారు. బుధవారం గుర్తు తెలియని వాహనం రెండు ఆవులను బలంగా ఢీ కొంది. దీంతో అవి తీవ్రంగా గాయపడ్డాయి. బాధిత రైతులు శ్రీనివాసులు, గిరిలు ఈ విషయాన్ని జోలాపుట్టు పశువైద్య సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ఎంసీ హెచ్ వరలక్ష్మి, డెయిరీ సైన్స్ ట్రైనీ విద్యార్థి త్రిష గాయా లు తగిలిన పశువులకు వైద్య సేవలందించారు. గాయాలకు కుట్లు వేసి, సెలైన్ బాటిల్స్‌ను ఎక్కించి వాటి ప్రాణాలను కాపాడారు.


ఆగని ఆర్టీసీ బస్సు... డ్రైవర్ తీరుపై మహిళలు ఆగ్రహం



ఆపకుండా వెళ్లిపోయిన అనకాపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఇదే

ముంచంగిపుట్టు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద బుధవారం ఆర్టీసీ బస్సును డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. వివరాలివి..పోలీస్ స్టేషన్ సమీపంలోని బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు కోసం కొంత మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో అనకాపల్లి ఆర్టీసీ డిపోన కు చెందిన ఏపీ 35జెడ్ 0100 నంబర్ గల బస్సు జోలాపుట్టు నుంచి వచ్చింది. ఆ సమయంలో పాడేరు వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షిస్తున్న మహిళలతోపాటు ఇతర ప్రయాణికులను చూసిన డ్రైవర్ బస్సును ఆపకుండా వెళ్లిపోయారు.. దీంతో గంటల తరబడి బస్సు కోసం నిరీక్షించిన ఆ ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలపై వెళ్లాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను ప్రవేశపెడితే కొంతమంది ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ సేవలకు దూరమతున్నామని మహిళా ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విద్యా శాఖ కమిషనర్ (పరీక్షలు) శశికుమార్

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి బాల బాలికల అండర్ 14, 17 విభాగాల కబడ్డీ, షటిల్ క్రీడా పోటీలను బుధవారం అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్షలు) ఆర్.శశికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోటీలలో విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కనపరచాలని కోరారు. డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్టు స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ పాంగి సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.విశ్వప్రసాద్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ కొండబాబు, పీఈటీ, పీడీలు భూపతిరాజు, శివ, బుద్దు, సద్దు, చిన్నిబాబు, సత్యవతి, కొండమ్మ పాల్గొన్నారు.

17వ రోజుకు చేరిన కాఫీ రైతుల రిలే దీక్షలు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస గ్రామంలో కాఫీ రైతులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 17వ రోజుకి చేరింది. బుధవారం ఈ శిబిరాన్ని ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు కలిసి సంఘీభావం తెలిపారు.



లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు బుధవారం పంపిణీ చేశారు. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన తుంపాల రామకృష్ణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్షా 52 వేలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును రామకృష్ణకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంపు హౌస్‌కు మరమ్మతులు పూర్తి

» తాగునీటి సరఫరాకు తొలగిన అడ్డంకి



పంపుహౌస్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జన్నవరం పంపు హౌస్‌కు చెందిన మోటారు మరమ్మతులను బుధవారం పూర్తి చేశారు. తాగునీటి పథకాలకు నీటిని పంపు చేసే మోటారు మంగళవారం మరమ్మతుకు గురైంది. దీంతో పట్టణంలో తాగునీటి సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఈ పంపు హౌస్ మరమ్మతు పనులు బుధవారం ఉదయం ప్రారంభించారు. మధ్యాహ్నానికి పనులు పూర్తి చేసి వాటర్ ట్యాంకులకు నీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో పట్టణంలో తాగునీటి సరఫరాకు తలెత్తిన ఆటంకం తొలగినట్టయింది. ఈ పంపు హౌస్ మరమ్మతు పనులను పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది దగ్గరుండి పూర్తి చేశారు.

మాదక ద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన



విద్యార్థులకు మదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సోమేశ్

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నషాముక్త భారత్ అభియాన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకం, వాటి అలవాటు పడితే కలిగే అనర్థాలను సంస్థ ప్రతినిధి ఎస్.సోమేశ్ వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీవీ.సత్యవతి, కోఆర్డినేటర్ నారాయణమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, పిచ్చమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీవి శవ, కుల రాజకీయాలు..

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర



మాట్లాడుతున్న రాజాన వీర సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కందుకూరు ఘటనపై వైసీపీ శవ, కుల రాజకీయాలు చేస్తున్నదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కందుకూరులో జరిగిన ఘటనను బూచిగా చూపించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఏ1గా, సీఎం చంద్రబాబును ఏ2గా, మంత్రి నారా లోకేశ్‌ను ఏ3గా చేర్చాలని వైసీపీ నాయకుడు జక్కంపూడి రాజా అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శవ రాజకీయాలతో వైసీపీ పుట్టిందని ఎద్దేవా చేశారు. అటువంటి పార్టీ చెప్పే మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి అట్టాడ నరేష్, గండెం దొరబాబు, చోద్యం పీఏసీఎస్ డైరెక్టర్ రేగుబళ్ల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండండి



వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారలుఉ, శాస్త్రవేత్తలు

మాడుగుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని జమ్మాదేవిపేట, కేజేపురం గ్రామాల్లో పంటలను కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్త రాజ్‌కుమార్, నర్సీపట్నం ఏడీ శ్రీదేవి, ఏవో అనసూయ పరిశీలించారు. తెగుళ్లపై రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరి పంటలకు పొటాష్ దాతువు లోపం ఉంటే పది కిలోల పొటాష్, 33 కిలోల యూరియా ఎకరా పొలానికి వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నేత రాజ్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది జగ్గారావు, చందన, పరిమల, సతీశ్ పాల్గొన్నారు.

తట్టబందలో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

రావికమతం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తట్టబంద పంచాయతీ పరిధిలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని సర్పంచ్, గ్రామస్థులు కోరారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో పర్యటించిన ఎంపీడీవో మహేష్‌కు సర్పంచ్ జి.రమణతో కలిసి సమస్య వివరించారు. రూ.14 లక్షల నిధులతో నిర్మిస్తున్న నీటి పథకం, కశిరెడ్డిపాలెం, బూరుగుపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో చెప్పారు.

తాను దూర సందు లేదు..!

» ఇరుకు భవనంలో ఉపాధి హామీ పథకం ఏపీవో కార్యాలయం

» ..అందులోనే ఏపీడీ కార్యాలయ సామగ్రి, అడ్డుగా బల్లలు

» ఏపీడీ కార్యాలయం సిద్ధం చేసినా తరలించని అధికారులు

» ఉపాధి పథకం సిబ్బంది, లబ్ధిదారులు అగచాట్లు

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'తాను దూర సందు లేదు.. మెడకో డోలు' అన్న చందంగా తయారైంది ఉపాధి హామీ పథకం ఏపీవో కార్యాలయం పరిస్థితి. నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సమాఖ్య భవనం పై అంతస్తులో గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో కార్యాలయం ఉంది. ఈ కార్యాలయ ప్రాంగణం ఇరుకుగా ఉంటుంది. అందులోనే ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ సహాయ అధికారికి ఒక గది కేటాయించారు. ఆఫీసురికార్డులు భద్రపరిచిన పెట్టెలు, కుర్చీలు, బల్లలు, కంప్యూటర్లు అక్కడే ఉంచారు. ఏపీడీ కార్యాలయం కోసం నర్సీపట్నం పాత మునిసిపల్ ఆఫీసు పై అంతస్తులో అన్ని సౌకర్యాలతో క్యాబిన్ సిద్ధం చేశారు. అక్కడే డీడీవో, డీఎల్‌పీవో కార్యాలయాలు కూడా ఉన్నాయి. అయితే ఏపీడీ కార్యాలయం సిద్ధం చేసి రెండు నెలలు కావస్తున్నా, కార్యాలయాన్ని మాత్రం తరలించ లేదు. దీంతో ఇరుకు ఇరుకుగా ఉన్న ఏపీవో కార్యాలయంలోని వరండాలలో ఏపీడీ కార్యాలయ సామగ్రిని పేర్చడం వల్ల లబ్ధిదారులు, సిబ్బంది తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.



ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ కార్యాలయానికి సంబంధించిన సామగ్రిని ఇరుకుగా ఉన్న ఏపీవో కార్యాలయం వరండాలో పేర్చిన దృశ్యం

శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు





పూజలు అందుకున్న శివుడు.. ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభంతో శివాలయాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో కార్తీకమాసం నిర్వహించే భక్తులతో పాటు శివ భక్తులు తాకిడి అధికమై శివ నామస్మరణంతో ఆలయాలు మారుమోగుతున్నాయి. మాడుగుల కేంద్రంలో భీమలింగేశ్వర, స్వర్గ లింగేశ్వర, కృష్ణ భూపాలేశ్వర, ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు దుర్గాలమ్మ, కన్యాకాపరమేశ్వరి, బోయపాడు మార్గంలోని శివాలయాల్లో బుధవారం తెల్లవారు నాలుగు గంటల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. సమీపంలోని నదీ ప్రవాహాల్లో స్నానాలను ఆచరించి శివుడికి ఘనంగా పూజలు చేశారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ నామ స్మరణంతో ఆలయాలు మార్మోగాయి. గ్రామానికి రెండు కిలో మీటర్లు దూరం అడవిలో ఉన్న ఉబ్బలిగేశ్వరస్వామి ఆలయ సమీపంలో నీటి ప్రవాహం వద్ద తెల్లారింటికే స్నానమాచరించే భక్తులు ఇబ్బంది పడకుండా విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేశారు. అలాగే మిగిలిన ఆలయాల్లో కూడా భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

టీడీపీలోకి ఎస్.రాయవరం జడ్పీటీసీ దేవి

ఎస్.రాయవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎస్.రాయవరంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోం మంత్రి వంగలపూడి అనిత టీడీపీ కండువా కప్పి జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవిను పార్టీలోకి ఆహ్వానించారు. అంతేకాకుండా వాకపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత పిట్ల నాయుడుతో పాటు మరో ఇరవై మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సమానంగా అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, నాయకులు అల్లు నరసింహమూర్తి, సోమిరెడ్డి రాజు పాల్గొన్నారు.

మేడిచర్ల పాఠశాలను సందర్శించిన జిల్లా ఉపాధ్యాయ శిక్షణ బృందం

కె.కోటపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మేడిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలను విశాఖ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) బృందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డైట్ బృందం అల్లావుద్దీన్, స్వామి, రమణ, ఉదయ్ శేఖర్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జీవీఎన్.శివానంద, సిబ్బంది పాల్గొన్నారు.

దొండపూడిలో గౌరీపరమేశ్వర్ల విగ్రహ ప్రతిష్ఠ

రావికమతం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి హైస్కూల్ కాలనీలో శ్రీదుర్గాదేవి ఆలయం వద్ద గౌరీ పరమేశ్వర్లు విగ్రహ ప్రతిష్ఠ (అంకురార్పణ) కార్యక్రమం బుధవారం ఆ కాలనీ వాసులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వైభవంగా నిర్వహించారు. ఏటా కార్తీక మాసం ఆరంభంలో ఇక్కడ గౌరీ పరమేశ్వర్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రత్యేక ప్రత్యేక చేసిన అనంతరం నిమజ్జనం చేస్తారు. అంతకు ముందు గ్రామస్థులు గౌరీ పరమేశ్వర్లను గ్రామ పొలిమేర్ల నుంచి డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ ఊరేగింపుగా ఆలయం వరకు వచ్చారు.

నర్సీపట్నం అభివృద్ధికి కలిసి పనిచేద్దాం



స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ నరసింహమూర్తి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రధాన లక్ష్యమని, నర్సీపట్నం అభివృద్ధికి కలిసి పని చేద్దామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇటీవల వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి బుధవారం ఇక్కడ స్పీకర్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. వీరిద్దరు కొద్ది రోజుల క్రితం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆ సమయంలో యూరప్ పర్యటనలో వున్న అయ్యన్నపాత్రుడు రెండు రోజుల క్రితం తిరిగి వచ్చారు. దీంతో ఆదిలక్ష్మి, నరసింహమూర్తి మరికొంత మందితో స్పీకర్ క్యాంప్ కార్యాలయానికి వచ్చి కలిశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, నాయకులు చింతకాయల విజయ్, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణపులోవకు 250 క్యూసెక్కుల వరద

రావికమతం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతూనే వుంది. నీటిమట్టం ఇప్పటికే గరిష్ఠస్థాయికి చేరడంతో అదనపు నీటిని సర్పా నదిలోకి విడు దలచేస్తున్నారు. ఈ రిజర్వాయర్ గరిష్ఠ నీటమట్టం 460 అగులుకాగా, 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతున్నది. బుధవారం నీటి మట్టం 458.05 అడుగుల వద్ద నిలకడగా వుంచుతూ, స్పిల్‌వేలో రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో 50 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు సరఫరా చేస్తున్నారు. రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల్లో సర్పా నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్టు జలాశయం ఏఈ డి.సూర్య తెలిపారు.

హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని నిరసన

మాకవరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోవరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు హెల్త్ అలవెన్స్ రూ.4 వేలు అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, మండలంలో ఎక్కడా అమలు కాలేదన్నారు. అనేక పంచాయతీల్లో కార్మికులకు రూ.6 వేలు చెల్లించాల్సి ఉండగా, రూ.3 వేలు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్మికులకు మాస్కులు, రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరావు, మండల అధ్యక్షుడు కిత్తయ్య పోతురాజు, నాయకులు చిరంజీవి, రామకృష్ణ, గోపి, ఏసు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

రోడ్డు నిర్మించాలని ఆదివాసీల డోలీ యాత్ర

రావికమతం,అక్టోబరు22,(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు డోలీ యాత్ర నిర్వహించారు. పాత కొట్నాబిల్లి నుంచి మోదమ్మ గుడి వరకు మూడు కిలోమీటర్ల మేర బుధవారం అర్ధనగ్నంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ మండలంలోని పి.కొట్నాబిల్లి, కె.కొట్నాబిల్లి, రామన్నదొరపాలెం, కె.గదబపాలెం, డోలవానిపాలె, ఎర్రబంద తదితర ఎనిమిది వేల జనాభా కలిగిన గిరిజన గ్రామాలకు చినపాచిల నుంచి వయా కొట్నాబిల్లి మీదుగా టి.అర్జాపురం ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 14 కిలోమీటర్ల మేర మట్టి మార్గం ఉండేదన్నారు. ఈ ప్రాంత వాసీ జడ్పీటీసీ సభ్యుడుగా ఉన్న సమయంలో 2008లో రూ.2.6 లక్షలతో తారురోడ్డుగా అభివృద్ధి చేశారన్నారు. దీంతో ఆదివాసీల కష్టాలు తొలగాయన్న ఆనందం తీరకముందే గ్రానైట్ క్వారీలతో సమస్య మొదటికి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎవరికి రోగమొచ్చినా, గర్భిణి పురిటి నొప్పులు వచ్చినా 108 వాహనమే రాలేని దుస్థితిలో రోడ్డును గ్రానైట్ వాహనాలు ధ్వంసం చేశాయని ఆయన వాపోయారు. దీంతో అనేక సార్లు ఆందోళనకు దిగగా గత ప్రభుత్వ హయాంలో 2023లో రూ.6.98 కోట్లతో చినపాచిల చెరకు తూనిక కేంద్రం నుంచి వయా కొట్నాబిల్లి మీదుగా టి.అర్జాపురం బీఎన్ రోడ్డు వరకు 14 కిలో మీటర్లు తారు రోడ్డుగా అభివృద్ధికి అనుమతులు మంజూరయ్యాయని, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 2024 జనవరిలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు. అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.బెన్నయ్య, ఎస్.వలసయ్య పాల్గొన్నారు.



రింగ్ రోడ్డు నిర్మించాలని డోలీ యాత్ర చేస్తున్న నాలుగు గ్రామాల గిరిజనులు

షెడ్యూల్ ప్రకారం రీసర్వే పూర్తిచేయాలి

» జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వేను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జేసీ ఎం.జాహ్నవి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహించారు. పీజీఆర్ఎస్, రీసర్వే, ఎంఎల్‌సీసీ, ఐవీఆర్ఎస్, నీటి తీరువా, కోర్టు కేసులు, పౌరసరఫరాలు, దీపం-2 పథకం రీ పేమెంటు, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు రెండు విడతలు రీసర్వే చేశామని, మూడవ విడత అనకాపల్లి డివిజన్‌లో 15 గ్రామాలు, నర్సీపట్నం డివిజన్‌లో 15 గ్రామాల్లో ఈ నెల మూడో తేదీన రీసర్వే ప్రారంభమైందన్నారు. మొత్తం 80 బృందాలు పనిచేస్తున్నాయని, భవిష్యత్తులో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. రేషన్ షాపులు, బియ్యం బిల్లులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తహశీల్దార్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వై.సత్యనారాయణ రావు, ఆర్డీవోలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి, సర్వే ఏడీ గోపాలరాజు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

» పశు సంవర్ధక శాఖ ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) చిట్టినాయుడు సూచించారు. మండంలోని జైతవరం గ్రామంలో పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడుతో కలిసి ఏడీ ప్రారంభించారు. ఈ శిబిరంలో 46 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. అలాగే 42 పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ, దూడల పెంపకం గురించి రైతులకు వివరించారు. ఈ శిబిరంలో పశు వైద్యాధికారులు సౌజన్య, ఏవీఎస్.రాఘవమ్మ, ఎ.గణేశ్ కుమార్, మణిలక్ష్మణ్ పశువులకు వైద్య తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, సిబ్బంది సంతోశ్, గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

రోలుగుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 23 నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శిబిరాలు జరుగుతాయని చెప్పారు. అలాగే 27, 28న రోలుగుంట కేజీబీవీ, కొమరవోలు, కుసర్లపూడి జడ్పీ పాఠశాలల్లోను, 29, 30న కొంతలం, బీబీపట్నం, జె.నాయుడుపాలెం జడ్పీ పాఠశాలల్లోను ఈ ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఐదేళ్లు దాటిన పిల్లలందరికీ బయోమెట్రిక్‌తో పాటు ఆధార్‌లో సవరణలు తదితర సేవలు అందించనున్నట్టు చెప్పారు. రెండు టీముల ద్వారా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

గొలుగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలోని ఈ నెల 23వ నుంచి 30వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆధార్ నమోదు, తప్పుల సవరణ, ఇతరత్రా సమస్యలను ఈ శిబిరాల్లో సరి చేసుకోవాలని ససూచించారు. ఈ నెల 23వ తేదీన ఏఎల్.పురం, 24న కృష్ణాదేవిపేట, 25న చోద్యం, 27న కొత్తమల్లంపేట, 28న జోగంపేట, 30న కొత్తఎల్లవరం గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రనమం నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు.

వర్షాలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నాతవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నాతవరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని తహశీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. ముఖ్యంగా నాతవరం మండలంలో లోతట్టు ప్రాంతాలలో ఉన్నవారు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా ఎటువంటి సమస్యలు ఎదురైనా 8932225531 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

జానకిరాంపురంలో కార్తీక మహోత్సవాలు ప్రారంభం

రోలుగుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురంలో విశాలాక్షిసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మహోత్సవాలను ప్రారంభించారు. వచ్చే నెల 20వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక కార్తీక పూజలు చేస్తామన్నారు. సత్యనారాయ స్వామి వ్రతాలు, పంచామృతాభిషేకాలు, పాటు భక్తుల పేరున కుటుంబ గోత్ర నామాలతో పూజలు జరుగుతాయని వారు చెప్పారు. కార్తీక మహోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

దేవరాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, ఎంపీడీవో సువర్ణరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభాధ్యక్షులు సీడీపీవో లలితకుమారి మాట్లాడుతూ కిశోర్ వికాసం గురించి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని చెప్పారు. బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే జైలు శిక్ష, జరిమానా విధిస్తారని ఆమె స్పష్టం చేశారు. మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్ల వయస్సు నిండిన తరువాత వివాహం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీకం.. శుభకరం



విష్ణుదేవునితో సమానమైన దైవం లేదు. గంగతో సమానమైన తీర్థం లేదు. కార్తీక మాసంతో సమానమైన మాసం లేదు. తెల్లవారుజామునే నిద్రలేవడం, ప్రవహిస్తున్న నీటిలో స్నానాలు చేయడం. భోళాశంకరుడుకి నిత్యం రుద్రాభిషేకం చేయడం. నుదుటున విబూతి పెట్టుకోవడం. మెడలో రుద్రాక్ష ధరించడం. రోజుకి ఒక పూట మాత్రమే భుజించడం. ఉసిరి చెట్టునీడలో వనభోజనాలు చేయడం.... ఒకటేమిటి ఇలా ఎన్నెన్నో సంప్రదాయాలు, ప్రత్యేకతలు వున్నదే పవిత్రమైన కార్తీకమాసం.

అన్ని మాసాల్లోకెల్ల మహోన్నతమైనది

- కృత్తిక నక్షత్రంపై పూర్ణరూపంలో చంద్రుడు
- ప్రాతఃకాలం, సూర్యాస్తమం తరువాత శైవక్షేత్రంలో దీపారాధన
- పగలంతా ఉపవాసం, చీకటి పడిన తర్వాత భోజనం
- కార్తీక మాసానికి ఎన్నెన్నో ప్రత్యేకతలు



తమిళనాడులోని తిరుకడయ్యూర్‌లో అమృతకడేశ్వర్ స్వామి

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరే ఆ మాసానికి వస్తుంది. కృత్తిక నక్షత్రంపై చంద్రుడు పూర్ణుడై ఉండటం వల్ల ఈ మాసానికి కార్తీకమాసమని పేరు. ఈ మాసంలో కృత్తిక నక్షత్రానికి, దీపారాధనకు, సోమవారాలకు ప్రాధాన్యత ఉంటుంది. అన్ని నక్షత్రాల్లోకెల్లా కృత్తిక నక్షత్రానికి చాలా ప్రాముఖ్యత ఉంది. దేవతల్లో ప్రథముడైన అగ్నిదేముడు ఈ నక్షత్రానికి అధిపతి. అగ్ని నక్షత్రాలైన కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢాల్లో మొదిటిది కృత్తికయే. వేదకాలంలో సంవత్సరం కృత్తిక నక్షత్రంతోనే ప్రారంభమయ్యేది. ఈ నక్షత్రాన్ని అగ్ని నక్షత్రం అంటారు. అగ్ని ఆరు ముఖాలు కలవాడు. కృత్తికలు కూడా ఆరు నక్షత్రాలు. ఈ కృత్తికలకు ఒక విశిష్టత ఉంది. కుమారస్వామిని షణ్ముఖుడంటారు. అంటే ఆరు ముఖాలు కలవాడని అర్థం. ఆకాశంలో ఆరు కృత్తిక నక్షత్రాలు మాతృమూర్తులై క్షీరదం ఇవ్వగా.. కుమార స్వామి ఆరు ముఖాలతో పాలు తాగాడు. ఈ విధంగా కృత్తికలతో పెరగడం వల్ల కుమార స్వామికి కార్తికేయుడని పేరు వచ్చిందని చెబుతుంటారు.


ఉపవాసం

కార్తీక మాసంలో పగలంతా ఉపవాసం చేసి రాత్రి భోజనం చేయాలనేది ఒక నియమం. దీనినే నర్తం అంటారు. పగలంతా నిరాహారంగా ఉండలేని వారు పాలు లేదా పండ్లను స్వీకరించి చీకటి పడిన తర్వాత చంద్రదర్శనం చేసుకొని, దీపారాధన చేసి భోజనం చేయాలి.

కార్తీక సోమవారాల ప్రత్యేకత..

కార్తీకమాసంలో సోమవారాలకు ప్రత్యేకత ఉంది. సోమ వారానికి చంద్రుడు అధిపతి. దేవతల్లో ప్రథముడైన అగ్నిదేవుడు అగ్నినక్షత్రాల్లో మొదటిదైన కృత్తికకు అధిపతిగా ఉండడం, చంద్రుడు పూర్ణుడై ఈ నక్షత్రం మీద ఉండడం వల్ల ఈ మాసంలో సోమవారాలకు విశిష్టత వుంది. చంద్రుని వారమైన సోమవారం శివునికి ఎంతో ప్రీతికరమైనది. శివభక్తులు ఈ మాసంలో. ముఖ్యంగా సోమవారాల్లో భక్తి శ్రద్ధలతో, నియమనిష్టలతో శివుడిని ఆరాధిస్తారు. కార్తీకమాసం ప్రారంభం నుంచి సూర్యోదయానికి ముందు తల స్నానం చేసి, శివుడిని ఆరాధించే వారికి భోళాశంకరుడి అనుగ్రహం ఉంటుందని భక్తుల నమ్మకం.

కార్తీకమాసం.. ఆకాశదీపం



ఆలయంలో ధ్వజస్తంభానికి వేలాడదీసిన ఆకాశదీపం

శివకేశవులకు ఎంతో ప్రీతికరమైనది కార్తీకమాసం. ఈ మాసం ప్రారంభం కాగానే దేవాలయాల్లో ధ్వజస్తంభానికి ఆకాశదీపం వేలాడదీస్తుంటారు. చిన్నచిన్న రంధ్రాలున్న ఓ గుండ్రని ఇత్తడి పాత్రలో నూనె పోసి ఈ దీపాన్ని వెలిగిస్తారు. తాడు సహాయంతో పాత్రను పైకి పంపించి, ధ్వజ స్తంభం పైభాగాన వేలాడదీస్తారు. ఈ దీపంలో నూనె పోయడానికి, దీపాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళుతుంటారు. ఈ దీపం వల్ల పితృదేవతలు సంతృప్తి చెందుతారని పురాణాల్లో ఉంది.

నేడు 'భగినీ హస్త భోజనం'

కార్తీక మాసంలో మొదటిగా వచ్చే విదియనాడు పురుషులు తమ సోదరి ఇంట భోజనం చేయాలి. దీనినే భగినీ హస్తభోజనం అంటారు. దీని విశిష్టత ఏమిటంటే.. కార్తీక మాసంలో మొదటిగా వచ్చే విదియను 'యమ విదియ' అని కూడా అంటారు. అన్నాచెల్లెళ్ల పండుగ అని కూడా పిలుస్తారు. యమధర్మరాజు తన సోదరి అయిన యమున ఇంటికి కార్తీక శుద్ధ విదియనాడు భోజనానికి వె ళ్లాడు. యమధర్మరాజుకు ఇష్టమైన వంటలు వండి ప్రేమతో కొసరికొసరి వడ్డిస్తుంది. సుష్టుగా భోజనం చేసిన యమధర్మరాజు తన చెల్లెలను ఆశీర్వదించి ఏమి కావాలో వరం కోరుకోమంటాడు. ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ విదియనాడు ఏ పురుషుడైతే సోదరి ఇంట్లో భోజనం చేస్తారో వారికి అపమృత్యుదోషం లేకుండా చేయాలని వరం కోరుతుంది. ఈ సంత్సరం అక్టోబరు 23వ తేదీన 'భగినీ హస్త భోజనం' రోజు వచ్చింది.

ధాత్రి పూజ

ధాత్రి అంటే ఉసిరిక. ఉసిరిక లక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనది. కార్తీకమాసంలో ఉసిరి వృక్షం కింద భోజనం చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని నమ్మకం. ఉసిరిక వృక్షం మొదట్లో ధాత్రిదేవిని, దామోదరుని పూజించి మధుర పదార్థాలను నివేదించాలి. బంధుమిత్రులతో కలిసి ఉసిరి చెట్టుఉన్న వనంలో భోజనం చేయడం వనభోజనాలుగా ప్రసిద్ధి చెందింది.

కార్తీకమాసంలో శివుడిని దర్శించుకుంటే..

శివుడు తన భక్తులకు సదా కాపాడుతుంటాడు. నిస్వార్థంతో నిరంతరం తన నామస్మరణ చేసే వారిని మృత్యువు బారినుంచి రక్షిస్తుంటాడని భక్తుల నమ్మకం. ఈ విషయంలో యమధర్మరాజుని సైతం ఆయన ఎదిరించిన ఘట్టం మార్కండేయుడి జీవిత చరిత్రలో వుంది. మార్కండేయుడు ఆయువు తీరడంతో తన ప్రాణాలు రక్షించుకోవడం కోసం శివలింగాన్ని హత్తుకుంటాడు. మర్కండేయుని ప్రాణాలు తీయాలని యముడు తన పాశాన్ని వదులుతాడు. అది శివలింగాన్ని చుట్టుకోవడంతో ఆగ్రహించిన శివుడు, ఉగ్ర రూపుడై యముడిని వధిస్తాడు. సమస్త దేవతల ప్రార్థనల మేరకు యముడిని తిరిగి బతికిస్తాడు. తన భక్తుల విషయంలో ఆచితూచి వ్యవహరించమని శివుడు, యముడిని సున్నితంగా మందలిస్తాడు. ఈ ఘట్టం తమిళనాడులోని తిరుకడయ్యూర్‌లో జరిగిందని చెబుతుంటారు. ఇక్కడ శివుడుని 'అమృతకడేశ్వర్' రూపంలో దర్శనమిస్తాడు. శివుడిని కాలసంహార మూర్తిగా పూజిస్తారు. ఇక్కడ శివుడి కాళ్లకింద నలుగుతున్నట్టుగా యమధర్మరాజు, ఆ పక్కనే శివునికి వినయంగా నమస్కరిస్తూ మార్కండేయుడు దర్శనమిస్తారు.

క్రైం... crime news

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరువాడకు చెందిన బలిరెడ్డి అప్పారావు(49) బైపాస్ రోడ్డులోని ఒక రిసార్ట్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలబడి ఉండగా, పెందుర్తి వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి ఢీకొనడంతో అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందాడు. భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాము కాటుతో మహిళ మృతి



గంగుమళ్ల లక్ష్మి (ఫైల్ ఫొటో)

కె.కోటపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడలో ఒక మహిళ పాము కాటుకు గురై మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌడువాడకు చెందిన గుంగుమళ్ల లక్ష్మి (55) మంగళవారం సాయంత్రం తన ఇంటి వద్ద కట్టెల మండెపై కప్పిన ప్లాస్టిక్ కవర్‌ను తీస్తున్నది. అప్పటికే అక్కడ దాగిఉన్న పాము ఆమెను కాటు వేసింది. వెంటనే ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి చూశారు. పాము కాటు వేసిందని ఆమె చెప్పడంతో వెంటనే కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

గొలుగొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నయ్యపాలెం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రామన్నపాలేనికి చెందిన వనగల అప్పలనాయుడు బుధవారం రాత్రి బైక్‌పై కృష్ణాదేవిపేట నుంచి సొంతూరు వెళుతున్నాడు. చిన్నయ్యపాలెం సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ వచ్చి, క్షతగాత్రుడిని గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు.

పోలీసులకు చిక్కిన దొంగ

పాయకరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటలో చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న దొంగను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం జ్ఞానాపురానికి చెందిన కోట్ల అచ్యుతరామరాజు ఈ నెల 16న పాయకరావుపేట రాజుగారిబీడులో ఓ ఇంటి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, యాపిల్ ఇయర్ ప్యాడ్‌ను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అచ్యుతరామరాజు మరోమారు దొంగతనం చేయడానికి సీతారాంపురం గ్రామానికి రాగా.. పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులు ఈ నెల 28వ తేదీ రాత్రి 11.59 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఎల్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు www.dbtyas-sports.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఖేలో ఇండియా క్రీడల్లో విశాఖ క్రీడాకారిణుల ప్రతిభ

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఖేలో ఇండియా క్రీడల్లో విశాఖపట్నానికి చెందిన క్రీడాకారిణులు ప్రతిభ కనబరిచారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లా వర్సిటీలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా అస్మిత పెన్‌కాక్ సిలాట్ విమెన్స్ లీగ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొనగా, విశాఖపట్నం క్రీడాకారిణులు ప్రథమ స్థానంలో నిలిచారు. విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో లా వర్సిటీ స్పోర్ట్స్ పీడీ మంగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి, నిర్వాహకులు ఆడారి కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి నవంబరు 5 వరకు అనకాపల్లిలో నిర్వహించనున్న విజయవాడ పుస్తక మహోత్సవ్ (బుక్ ఫెస్టివల్) పోస్టర్‌ను బుధవారం విశాఖపట్నంలోని కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చిటికెలో విద్యుత్ కనెక్షన్

... 5వ పేజీ తరువాయి

మండలి కొన్ని సవరణలు చేయడంతో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానం తీసుకువచ్చింది. 150 కిలోవాట్ల వరకు కనెక్షన్లకు ఫిక్స్‌డ్ చార్జీలు నిర్ణయించారు. ఈ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లిస్తే వెంటనే కనెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ అయిపోతాయి. దీనివల్ల చాలా తక్కువ సమయంలో విద్యుత్ సదుపాయం లభిస్తుంది. సైట్ ఇన్‌స్పెక్షన్, ఎస్టిమేషన్ వంటివి ఇందులో ఉండవు.

ఎవరికి వర్తిస్తుందంటే..?

ఇప్పటికే విద్యుత్ సదుపాయం ఉన్న ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్న వారు కొత్త కనెక్షన్ తీసుకుంటే చార్జీలు ఇలా ఉంటాయి.

- గృహ వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,500.
- వాణిజ్య వినియోగదారులకు మొదటి కిలోవాట్‌కు రూ.1,800

...ఆపై ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2 వేలు చొప్పున తీసుకుంటారు. ఇలా 20 కిలోవాట్ల వరకు లెక్కించి తీసుకుంటారు.

ఇవికాకుండా కనెక్షన్ లోడ్ చార్జీల (డొమెస్టిక్) కింద సర్వీస్ లైన్, డెవలప్‌మెంట్ చార్జీలు కలిపి 500 వాట్ల వరకు రూ.800, ఆపై 501 నుంచి 1000 వాట్ల వరకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది.

నాన్ డొమెస్టిక్/కమర్షియల్ కనెక్షన్లకు

మొదటి 250 వాట్ల వరకు రూ.600, 251 వాట్ల నుంచి 500 వాట్ల వరకు రూ.1,000 కట్టాలి. ఇలా ఎల్‌టీ-3, ఎల్‌టీ-4, హెచ్‌టీ కనెక్షన్ కోరుకునే వారికి చార్జీలు నిర్ణయించారు.

ముందుగా చెల్లించడంతో తక్షణ సేవలు

పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీఈపీడీసీఎల్

స్థిరమైన చార్జీలు ముందుగానే నిర్ణయించడం వల్ల ఎస్టిమేషన్ పేరుతో జాప్యం ఉండదు. విచక్షణా అధికారంతో అంచనాలు పెంచే అవకాశమూ లేదు. ఎవరికి ఎంత విద్యుత్ లోడ్ పడుతుందో లెక్కించుకొని ఆ మేరకు చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. దీని వల్ల తక్షణమే సేవలు అందించగలుగుతాము. ఇదంతా పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

అభివృద్ధిని ఓర్వలేక కులాల మధ్య చిచ్చు

- వైసీపీపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం
- అడ్డరోడ్డు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

ఎస్.రాయవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను రెచ్చగొడుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్ వద్ద టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహాన్ని బుధవారం హోం మంత్రి అనితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రైవేటు స్టీల్‌ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్క్, గూగుల్ డేటా సెంటర్, బీపీఎల్ రిఫైనరీ వంటి భారీ సంస్థలు ఏర్పాటు కాకుండా ఏదో విధంగా అడ్డుకోవాలనే ఉద్దేశంతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు విషయంలో రాజయ్యపేట మత్స్యకారులకు న్యాయం చేస్తామన్నారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ, వైసీపీ హయాంలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను స్వాగతించిన వైసీపీ నాయకులు ఇప్పుడు మత్స్యకారులను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఎస్.రాయవరంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నాయకులు కోట్ని బాలాజీ, లాలం కాశీనాయుడు, యేజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి వెంకటేశ్, ఎస్.వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, తుమ్మపాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర. వేదికపై హోం మంత్రి అనిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, పార్టీ నేతలు

పట్టాలెక్కని పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

జలాశయం చుట్టూ కొండలు, అడవులతో సహజసిద్ధమైన అందాలకు నెలవుగా వుండడంతో దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. గత ఏడాది అక్టోబరులో కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ అప్పటి కమిషనర్ విశ్వనాథన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు తారకరామ జలాశయ పరిసరాలను పరిశీలించారు. ఇక్కడ సుమారు 120 ఎకరాల ప్రభుత్వ భూములను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు డీపీఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. దీని ప్రకారం తొలిదశలో జలాశయం పరిసరాల్లో పర్యాటకుల విడిది కోసం కాటేజీలు నిర్మించి, రిజర్వాయర్‌లో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ అందుబాటులోకి తీసుకురావాలి. మైదాన ప్రాంతం నుంచి పాడేరు మండలం వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం, హుకుంపేట మండలం మత్స్యగుండం వంటి పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శనకు వెళ్లేవారు.. దారిలో తారకరామ జలాశయం వద్ద నిర్మించే కాటేజీల్లో ఒక రోజు విడిదిచేసి, ఆహ్లాదంగా గడిపేలా చేయాలన్నది ప్రణాళిక. ఇంకా పర్యాటక శాఖ, ప్రైవేటు ఆధ్వర్యంలో హోటళ్లు, రెస్టారెంట్‌లు, లాడ్జీలు అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి లభిస్తాయని అధికారులు భావించారు. ప్రభుత్వానికి డీపీఆర్ పంపి ఏడాది కావస్తున్నప్పటికీ ఇంతవరకు ఎటువంటి కదలిక లేదు. దీనిపై జిల్లాస్థాయి అధికారులు, ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు స్పందించడలేదు. డీపీఆర్‌పై ప్రభుత్వ స్పందన ఏమిటన్నది కూడా పర్యాటక శాఖ అధికారులు చెప్పడం లేదు.

మరింత సమర్థంగా ఆహార భద్రతా విభాగం

- పక్షం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక
- శాసనసభా ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణరాజు



మీడియాతో మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు. పక్కన పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'ఆహార భద్రతా విభాగం మరింత సమర్థంగా పనిచేసేలా చూస్తాం. ఇందుకోసం తగిన సూచనలు చేస్తూ పక్షం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని శాసనసభా ఫిర్యాదుల కమిటీ చైర్మన్, ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కమిటీ నేతృత్వంలో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఆహార భద్రతా విభాగానికి సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. విభాగంలో 500 మందికిగాను 54 మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది కొరతను అధిగమించేందుకు సచివాలయాల్లో అర్హులైన ఉద్యోగుల సేవలు వినియోగించుకోవచ్చు. దీనిపై ప్రభుత్వానికి సూచన చేస్తాం. సుమారు 200 నుంచి 250 మంది సచివాలయ ఉద్యోగులను ఆహార భద్రతా విభాగానికి తీసుకుంటే కొంతవరకు కొరతను అధిగమించవచ్చు. దీనికి మా కమిటీ మొదటి ప్రాధాన్యం ఇస్తుంది. నాలుగు నెలల్లో ఈ విభాగాన్ని పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తాం. రాష్ట్రంలో ల్యాబ్‌ల కొరత కూడా ఉంది. విశాఖపట్నంలో ఏడాది క్రితం ప్రారంభించిన లేబొరేటరీలో పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేరని అధికారులు మాకు వివరించారు. నవంబరు తొలి వారం నుంచి విశాఖ ఫుడ్ లేబొరేటరీలో పరీక్షలు నిర్వహించేలా చూస్తాం. ఆహార భద్రత విషయంలో దేశంలో ఏపీ 29వ స్థానంలో ఉంది. ఆహార కల్తీ ఎక్కువగా ఉంది. ఈ విభాగంపై ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో సమీక్షించాం. ఆహారంలో రంగుల వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేయాలని విభాగాన్ని ఆదేశించాం' అని రఘురామ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఫిర్యాదుల కమిటీ సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా విభాగం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఫైర్ స్టేషన్ స్థాయి పెరిగేనా!


... 5వ పేజీ తరువాయి

లీడింగ్ ఫైర్ మెన్, నలుగురు ఫైర్‌మెన్, ఆరుగురు హోంగార్డు ఫైర్ సిబ్బంది పనిచేస్తున్నారు. పరిధి ఎక్కువగా ఉండడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఒక అగ్నిమాపక శకటంతో సేవలు అందించలేక పోతున్నారు. ఈ ఏడాది జూన్‌లో పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో భారీ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఒక శకటంతో మంటలు అదుపు చేయడం సాధ్యం కాలేదు. సమీపంలో వున్న రావికమతం మండలం నుంచి శకటాన్ని రప్పించాల్సి వచ్చింది. పరిధి ఎక్కువగా ఉండడంతో ఏదైనా ఒక మండలంలో అగ్నిప్రమాదం జరిగి, మంటలను అదుపు చేయడానికి ఇక్కడి నుంచి వాహనంతో సిబ్బంది వెళితే, ఇదే సమయంలో మరోచోట అగ్ని ప్రమాదం జరిగినట్టు సమాచారం వస్తే నిస్సహాయ పరిస్థితి నెలకొంటున్నది. అగ్నిప్రమాదం జరిగినట్టు ఎవరైనా ఫోన్ చేస్తే.. 'వాహనం అందుబాటులో లేదు. వచ్చిన తర్వాత పంపుతాము' అని సమాధానం చెప్పాల్సి వస్తున్నది. నర్సీపట్నంలో ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక శకటానికి అదనంగా మరొకటి వుంటే ఇటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు. డబుల్ యూనిట్ స్థాయికి పెరగడం వల్ల కొత్తగా అత్యాధునిక అగ్నిమాపక వాహనం మంజూరు అవుతుంది. ఇప్పుడు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ స్థాయి పెరిగి సహాయ జిల్లా ఫైర్ అధికారి పోస్టు మంజూరు చేస్తారు. సిబ్బంది కూడా రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

మత్స్యకారులకు అండగా ఉంటాం

- శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులకు అండగా ఉంటామని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ నిరసన తెలుపుతున్న మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని ఆయనతోపాటు మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే ప్రతిపక్షంలో వున్నప్పుడు మత్స్యకారులకు ఏ మాట చెప్పారో? ఇప్పుడు ఆ మాటకు ఇప్పుడు కట్టుబడి వుండాలన్నారు. రాజకీయాలు చేయడానికి తాము రాలేదని, ఇక్కడి సమస్యను పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకు వెళతామని, అవసరమైతే ఆయనను కూడా తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చెంగల వెంకట్రావ్, కంబాల జోగులు, కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, పార్టీ నేతలు చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, శీరం నర్సింహమూర్తి పాల్గొన్నారు.



మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

మత్స్యకారుల ఆందోళనను తీసిపారేయకూడదు

-ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై అక్కడ మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను తీసిపారేయలేమని, దీనిపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, మత్స్యకారుల ఆందోళనకు గల కారణాలను తెలుసుకుని వాటిని నివృత్తిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పలు పరిశ్రమలు వ్యర్థజలాలు శుద్ధిచేయకుండానే సముద్రంలోనికి విడిచిపెడుతున్నాయని విమర్శించారు. దీని వల్ల మత్స్య సంపద లభ్యం కావడం లేదన్న మత్స్యకారుల ఆవేదన మేరకు అటువంటి కంపెనీలపై నిఘా ఉంచాలన్నారు.సీఎస్సార్ నిధులతో మత్స్యకారుల జీవనాన్ని మరింత మెరుగుపర్చాలన్నారు.

పనిచేయని ఎస్కలేటర్

... 5వ పేజీ తరువాయి

వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఇది పనిచేయకపోవడంతో లగేజీతో మెట్ల మార్గంలో నడుచుకుంటూ ప్లాట్‌ఫారాలకు చేరుకోవాల్సి వస్తున్నది. గతంలో గూడ్స్‌షెడ్డు వైపు ఒక టికెట్ బుకింగ్ కౌంటర్ ఉండేది. కరోనా సమయంలో మూతపడిన ఈ కౌంటర్‌ను తిరిగి తెరవలేదు. రైల్వేస్టేషన్‌కు అనకాపల్లి మండలంతోపాటు చోడవరం, మాడుగుల, ఏజెన్సీ ప్రాంతాల నుంచి నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేట గేటు జంక్షన్ మీదుగా గూడ్స్‌షెడ్డు వైపు వచ్చి నేరుగా రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు చేరుకొని ప్రయాణం సాగించేవారు. గూడ్స్‌షెడ్డు వద్ద టికెట్ బుకింగ్ కౌంటరు లేకపోవడంతో సుమారు రెండు వందల అడుగులకు పైగా ప్రధాన బుకింగ్ కౌంటరుకు చేరుకొని టికెట్ తీసుకున్న తర్వాత రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వెళ్లాల్సి వస్తుంది. ఎస్కలేటర్ పని చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఎస్కలేటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై రైల్వేస్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్‌ను వివరణ కోరగా.. ఎస్కలేటర్ మరమ్మతులకు గురైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్రాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549